# అసలైన అనురాగం




*కర్దమలగ్న హాలముఖ*
*కర్షణ శిథిలే పత్యౌప్రసుప్తే*
*అప్రాప్త మోహన సుఖా*
*ఘన సమయం పామరీ శపతి*

**భావం:** బురదలో చిక్కిన నాగలిని ఈడ్చి అలసిన భర్త నిద్రించగా, అనుకున్న కోరిక తీరని రైతు ఇల్లాలు వర్షాకాలాన్ని తిడుతోంది.

వానాకాలం వలపుల కాలం. అందుకే మన సినిమాలలో వానలో యుగళ గీతం తప్పనిసరి. నేటి యువతరం కృత్రిమంగా వానని సృష్టించుకుని రెయిన్ డాన్స్ పేరుతో ఆనందిస్తున్నారు.

ఒక వానాకాలంలో ఒక రైతు ఇల్లాలు ఆకాశంకేసి చూసింది. నల్లని మబ్బులు ఆకాశాన్ని కమ్మివేశాయి. అప్పుడప్పుడు మెరుపులు మెరుస్తున్నాయి. తన భర్తా, తనూ మేఘమూ, మెరుపూలా ఉంటామని పెళ్ళిలోనే అందరూ మెచ్చుకున్నారనుకుందామె. చల్లని గాలి ఆమె మనస్సులో మధురమైన ఊహలు కలిగించింది. సాయంత్రం భర్త రాగానే గుడికి వెళ్ళాలి. గుడి కోనేట్లో తామరలూ, కలవలూ భర్తను కోసితెమ్మనాలి. నీళ్ళలో తన భర్త ఈదుతూంటే యమునా నదిలో కృష్ణుడిలా ఉంటాడు. పూలు మాలకట్టి అమ్మవారి గుడిలో ఇవ్వాలి. మిగిలినపూలు తను అలంకరించుకోవాలి. గుళ్ళో ఉషాపరిణయం హరికథ చెప్తున్నారట. ఈరోజు అనిరుద్ధుడు ఉషాకన్య కలలో కన్పించే దృశ్యం చెప్తారట. హరికథ విని ఇంటికి వచ్చి, సుష్టుగా భోంచేసి, సుఖంగా గడపాలి అనుకుంది.

ఆమె వెంటనే వంటింట్లోకి వెళ్ళి కట్టెల పొయ్యి అంటించింది. పీతలతో కూర చేసింది. మామిడి వరుగులూ, చేపలూ కలిపి పులుసు పెట్టింది. ఎప్పుడూ వండే జొన్నన్నం కాకుండా వరి అన్నం వండింది. దొడ్లో నీళ్ళకాగు పెట్టి, వేణ్ణీళ్ళతో స్నానం చేసి, చుక్కల చీర కట్టుకుంది. కొప్పు ముడుచుకుని, సన్నజాజుల దండ పెట్టుకుంది. భర్తకోసం ఎదురు చూస్తూ కూచుంది.

వానాకాలం వలపుల కాలమే కాదు వ్యవసాయపు పనుల కాలం కూడా. రైతులు నేలను దున్ని, విత్తనాలు చల్లి, కష్టపడితేనే ఏడాదంతా భుక్తి గడుస్తుంది. అందుకని రైతు పొలానికి వెళ్ళి నాగలిని ఎడ్లకు కట్టి దున్నసాగాడు. సగం పనయ్యేసరికి అతని దురదృష్టంకొద్దీ నాగలి బురదలో ఇరుక్కుంది. ఎడ్లు లాగలేకపోయాయి. అతను ఎడ్లను విప్పి, నాగలిని చేత్తో బలంగా లాగాడు. రెండు మూడు గంటలు శ్రమపడితేనే కానీ లాగలేకపోయాడు.

అలసిపోయి ఇంటికి వచ్చిన భర్తను చూడగానే ఇల్లాలిలో సానుభూతి చోటుచేసుకుంది. "మావా దొడ్లో కాగులో వేణ్ణీళ్ళున్నాయి స్నానం చేసిరా" అంది. స్నానంచేసి వచ్చిన భర్తకు వడ్డించింది. ప్రత్యేకంగా వండిన

పదార్థాల రుచి కానీ, భార్య అలంకరణగాని అతని దృష్టిని ఆకర్షించలేదు. అలసిన అతను అన్నం తింటూనే నిద్రపోయాడు.

అనుకున్న కోరికలేవీ తీరని రైతు ఇల్లాలు "ఛీ వెధవ వానాకాలం. మావకి పని ఎక్కువ చేస్తోంది" అంటూ వర్షాకాలాన్ని తిట్టింది కానీ భర్తను ఏమీ అనలేదు.

పని ఎక్కువైనప్పుడు భర్తలు తమను పట్టించుకోవడంలేదని పోట్లాడే పడతులకు కథలోని పామరస్త్రీ ఆదర్శం కావాలి కదా.

******